# “ఈయన ఎవరో?”

## చదువుటకు నియమించినవి #13

V. రెండవ పస్కానుండి మూడవ దాని వరకు (కొనసాగింది).
   P. తుఫానును నిమ్మళింపజేయుట (మత్తయి 8:18, 23–27; మార్కు 4:35–41; లూకా 8:22–25).
   Q. దయ్యముపట్టిన యిద్దరిని బాగుచేయుట (మత్తయి 8:28–34; 9:1; మార్కు 5:1–21; లూకా 8:26–40).
   R. పాపులతో భోజనము చేయుట (ఉపవాసమును గూర్చిన చర్చ) (మత్తయి 9:10–17; మార్కు 2:15–22; లూకా 5:29–39).

ఈ పాఠంలో, “విరామములేని దినము” అనే మన అంశాన్ని ముగించుదాం. పరిసయ్యుల దేవదూషణతో కూడిన నిందతో ఆరంభమై – క్రీస్తు గలిలయ సముద్ర తూర్పుదరికి వెళ్లుటతో అంతమౌతుంది. ప్రభువు సముద్రాన్ని నిమ్మళింపజేసినప్పుడు, ఆయన శిష్యులు మాటలాడిన మాటల్లో దీని చర్చనీయాంశముంది: “– ఈయన ఎవరో, గాలియు సముద్రమును ఈయనకు లోబడుచున్నవని యొకనితో ఒకడు చెప్పుకొనిరి” (మార్కు 4:41; లూకా 8:25; మత్తయి 8:27లను చూడు). “ఈయన ఎవరు?” అనే ప్రశ్న ప్రభువు యొక్క పరిచర్య మొత్తంలో ప్రతిధ్వనించింది ఆయన నిజంగా ఎవరైయున్నారో గ్రహించడానికి ప్రజలకు ఎంతో కష్టమైపోయింది. పై కప్పు సందుగుండా దింపబడిన మనిషిని క్రీస్తు స్వస్థపరచినప్పుడు, “దేవదూషణ చేయుచున్న యిత డెవడు?” అని పరిసయ్యులు అడిగారు (లూకా 5:21). తన కన్నీళ్లతో ఆయన పాదములను కడిగిన స్త్రీని ప్రభువు క్షమించినప్పుడు, – “పాపములు క్షమించుచున్న యితడెవడని” ఆయనతో భోజనమునకు కూర్చుండిన అతిథులు ఆలోచించుకున్నారు (లూకా 7:49). క్రీస్తు చేయుచున్న కార్యములను గూర్చి రాజైన హేరోదు విన్నప్పుడు “యెవనిగూర్చి యిట్టి సంగతులు వినుచున్నారో అతడెవడో అని చెప్పి ఆయనను చూడగోరెను” (లూకా 9:9). విజయోత్సవముతో యేసు యెరూషలేములో ప్రవేశించినప్పుడు, “పట్టణమంతయు – ఈయన ఎవరో అని కలవరపడెను” (మత్తయి 21:10). తన్ను తిలకిస్తున్నవారిని కలవరపెట్టిన మూడు సంఘటనలను ఈ పాఠంలో చూద్దాం.

### “తుఫానును అణచిన ఈయన ఎట్టివాడో?”[1]

### (మత్తయి 8:18, 23-27, మార్కు 4:35-41; లూకా 8:22-25)

ఉపమానముల గూర్చిన మన గత పాఠంలో, మత్తయి ప్రకారం, “యేసు ఈ ఉపమానములు చెప్పి చాలించిన తరువాత, ఆయన అక్కడ నుండి వెళ్ళి ...”

(మత్తయి 13:53).[2] ఆయన గలిలయ సముద్రపు తూర్పు తీరానికి వెళ్లినట్టు మార్కు రిపోర్టు యిచ్చాడు: "ఆ దినమే [ఉపమానాలతో బోధించిన దినమున (మార్కు 4:34)] సాయంకాలమైనప్పుడు[3] ఆయన, అద్దరికి పోవుదమని వారితో చెప్పెను" (మార్కు 4:35). క్రీస్తు ప్రభువు సముద్రపు తూర్పు తీరానికి పయనించినట్టు దాఖలు చేయబడిన నాల్గింటిలో యిది మొదటిది. మార్కు యిలా దాఖలు చేశాడు: "వారు జనులను పంపివేసి, ఆయనను ఉన్నపాటున చిన్నదోనెలో తీసికొనిపోయిరి" (మార్కు 4:36ఎ). అంటే, సిద్ధపాటులేకుండ, ఆహారపదార్థాలు లేకుండా వెంటనే వెళ్లి పోయారన్న మాట. "ఆయన వెంబడి మరికొన్ని దోనెలు వచ్చెను" అని మార్కు రికార్డు చేశాడు (మార్కు 4:36బి). వారి దోనెలు ప్రభువున్న దోనెకు సమీపంలోనే పయనిస్తూ ఉండవచ్చు. వెంటనే రేగి వెంటనే అణచబడిన సముద్రంలోని తుఫానుకు యితర సాక్షులున్నట్టు ఈ వివరణ యిక్కడ చేర్చబడినట్టు కన్పిస్తుంది (మార్కు 4:1 చూడు).

జన సమూహాలనుండి కొంత విరామం కొరకు ప్రభువు ఈ ప్రయాణం చేసినట్టున్నారు (మత్తయి 8:18; మార్కు 4:36లను చూడు). ఆయన పూర్తిగా దేవుడైయున్నా, ఆయన పూర్తిగా నరుడుగా కూడా ఉన్నారు,[4] మరియు "విరామం లేని ఆ దినం" ఆయనను అలసిపోయేలా చేసింది. ఆయన త్వరలోనే నిదురించారు (లూకా 8:23). "ఆయన దోనె అమరమున తలగడమీద (తలవాల్చుకొని) నిద్రించుచుండెను" అని మార్కు సూచించాడు (మార్కు 4:38). తలగడ ఎమైయుందో J. W. Shepard యిలా వ్రాశాడు:

> మానవుడు యేసు దేహం అలసట చెంది సొక్కిపోయి గాఢ నిద్రలో పడియుంది సరస్సులోని చల్లటి గాలి తోటలు వలనను, నావ యొక్క లయబద్ధమైన కదలికవలనను మైమరచి పోయింది. ఆ దినమున జరిగిన సంభావాలను గూర్చి ఆయనకు సమీపమున కూర్చుండిన శిష్యులు కొందరు మెల్లగా మాట్లాడుకొంటూ ఉండగా, నిమ్మళంగా ఉన్న నీటిపైన నెమ్మదిగా తక్కినవారు పడవను నడుపుకొంటూ పోతున్నారు.[5]

కపెర్నహోమునుండి "గెరసీనుల దేశానికి" నీటిపై అడ్డంగా వెళ్లితే కొద్దిమైళ్ల దూరమే.[6] అనుకూలమైన వాతావరణంలో, ఆ పయనం రెండు, మూడు గంటలలో చేయవచ్చు.

ఈ ప్రయాణపు వాతావరణం అనుకూలంగా లేదు. ఎక్కువ సేపు గడవకముందే– "సముద్రము మీద తుఫాను లేచినందున ఆ దోనె అలలచేత కప్పబడెను" (మత్తయి 8:24; లూకా 8:23ఎ). "... దోనె నీళ్లతో నిండినందున వారు అపాయకరమైన స్థితిలో ఉండిరి" (లూకా 8:23).

గలిలయ సముద్రము వెంటనేవచ్చు తుఫానులకు లోనైయుంది. సముద్ర ఉపరి తలానికి అది 700 అడుగులు తక్కువగా ఉండి, పర్వత శ్రేణిచే చుట్టబడియుంది. పర్వత ప్రాంతం నుండి చల్లని గాలి ఆ సరస్సు మీద కొట్టగా, నెమ్మదిగా ఉన్న దాని ఉపరితలం క్షణాల్లోనే కల్లోలమైన అలలుగా మారిపోతుంది. ఆ నావలో ఉన్న కొందరు చేపలు పట్టేవారు గనుక పలు తుఫానులను వారా సముద్రంపైన చూచియుంటారు. అలాటి వారు సహితం భయపడ్డారు అంటే–అది సాధారణమైన తుఫాను కాదని సూచిస్తుంది.

ఆ పడవ అలలచే అటు యిటు కొట్టబడుతుండగా, యేసు నిద్రిస్తునేయున్నారు.

"తుఫానులో సయితము నిదురించగల ఈయన ఎవరో?" మనం అడుగవచ్చు. మన తొలి జవాబు. "సంపూర్తిగా అలసిపోయిన ఓ మనుష్యుడు" అనేదైయుండవచ్చు. ఎక్కువ సంపూర్ణమైన జవాబు – "తన దేవుని యందు విశ్వసించిన –అలసిన మనిషి" అని ఉండవచ్చు.

యేసు తుఫానువలన కలతపరచబడలేదు, కాని ఆయన శిష్యులు కలతచెందారు. "కలతచెందిన స్వరముల అరుపు" అన్నట్టు సినాప్టిక్ లేఖకులన్నారు.[7] "గనుక ఆయన యొద్దకు వచ్చి – ప్రభువా, ప్రభువా, నశించిపోవుచున్నామని చెప్పి ఆయనను లేపిరి" (లూకా 8:24). "... ప్రభువా, నశించిపోవుచున్నాము, మమ్మును రక్షించుమని చెప్పి ఆయనను లేపిరి" (మత్తయి 8:25); "... వారాయనను లేపి – బోధకుడా, మేము నశించిపోవుచున్నాము; నీకు చింతలేదా? అని ఆయనతో అనిరి" (మార్కు 4:38).

యేసు ఏమి చేయాలని వారు ఎదురుచూచారో మనకు తెలియదు. అంతకు మునుపు ఆయన సముద్రాన్ని నిమ్మళింపజేసినట్టు వారు చూచియుండలేదు. ఆయన దీనిని నిమ్మళింపజేసినందుకు వారు ఆశ్చర్యపడ్డారు (మత్తయి 8:27; మార్కు 4:41; లూకా 8:25). దీని విషయమై "ఏదో యొకటి చేయుమని" తన తండ్రికి మొర్రపెట్టిన బిడ్డవలె వారున్నట్టున్నారు – "ఆ ఏదో యొకటి" తనకు తెలియక పోయింది.[8]

శిష్యులు భయభ్రాంతులయ్యారు, కాని క్రీస్తు కాలేదు. ఆయన మొదటిగా తన శిష్యులను గద్దించారు: "అల్పవిశ్వాసులారా, యెందుకు భయపడుచున్నారని వారితో" ఆయన అన్నారు (మత్తయు 8:26ఎ).[9] తరువాత ఆయన గాలిని అలలను గద్దించారు: "ఆయన లేచి, గాలిని నీటి పొంగులను గద్దింపగానే అవి అణగి నిమ్మళమాయెను" (లూకా 8:24బి; మార్కు 4:39ఎ). గాలియు, తరంగములును వెనువెంటనే అణగిపోయాయి. గాలి ఆగిపోయిన తరువాత కూడా అలలు కరుకుగానే కొంతసేపు ఉంటాయిగాని, యిప్పుడు అవి రెండును ఒక్కసారే అణచబడ్డాయి; రెండు అద్భుతాలు ఏకంగా జరిగాయి.

గలిలయ సముద్రములో తుఫానులు వచ్చిపోవడం క్రీస్తు శిష్యులు చూచియుంటారు కాని అలాటిది వారు ఎన్నడు చూచియుండలేదు. అట్టి వింతైన అనుభవంలోవారు ముంచి తేల్చబడినవారై,[10] "ఈయన ఎవరో; ఈయనకు గాలియు సముద్రమును లోబడుచున్నవని చెప్పుకొనిరి" (లూకా 8:25బి). ఈ ప్రశ్నలకు జవాబు – "శక్తి వంతుడైన మనిషి" (లూకా 4:14; 5:17; 6:19; 8:46; 1 కొరింథీ. 5:4; 2 కొరింథీ. 12:9).

ఈ కథ నీకును నాకును వర్తింపు కలిగియుంది. మనమందరము జీవితంలోని తుఫానులవలన కొట్టబడినవారమే. కొన్ని సార్లయితే, శిష్యులవలెనే, మన విశ్వాసాన్ని కోల్పోయి "బోధకుడా, మేము నశించిపోవుచున్నాము; నీకు చింతలేదా?" అని కేకలు వేస్తాం (మార్కు 4:38 KJV). క్రైస్తవుని హృదయంలోని కల్లోల్లాన్ని – గలిలయ సముద్రపు తుఫానును అణచినట్టే ఆయన అణచగలడు.[11]

### "దేహములను, ఆత్మలను బాగుచేయు ఈయన ఎట్టివాడో?"

### (మత్తయి 8:28-34; మార్కు 5:1-21; లూకా 8:26-40)

గలిలయ సముద్రమునకు అద్దరిని – యేసును ఆయన శిష్యులును చేరవలసిన

గమ్యానికి చివరికి చేరుకున్నారు. వారు గదరేనీయుల దేశము చేరుకున్నట్టు మత్తయి దాఖలు చేశాడు (మత్తయి 8:28). అయితే మార్కు లూకాలు "గెరాసేనుల దేశమునకు వచ్చిరి" అని సూచించారు (మార్కు 5:1; లూకా 8:26).[12] గెరాస అనే దాన్ని గెర్గెసా అని కూడా పిలుస్తారు. గలిలయ తూర్పు తీరాన గెరసా అనే గ్రామముంది. ఆ దిశగా కొన్ని మైళ్లవరకు గదర అనే వాని చేత పాలింపబడుతూ ఉండేది. అందువలన ఆ ప్రాంతమంతా గెరాసేనుల దేశమనియు, "గదరేనీయుల దేశము" అనియు పిలువబడుతూ ఉండేది.[13]

నిర్మానుష్యమైన ఆ స్థలములో ఆయన విశ్రాంతి తీసికొనవలెననియుండగా, విశ్రాంతి ఆయనకు దూరమయ్యింది. వింతైన స్వాగత నిర్వహణంతో ఆయన ఆహ్వానించబడ్డారు. "ఆయన అద్దరినున్న గదరేనీయుల దేశము చేరగా దయ్యములు పట్టిన యిద్దరు మనుష్యులు సమాధులలోనుండి బయలుదేరి ఆయనకు ఎదురుగా వచ్చిరి" (మత్తయి 8:28ఎ).[14] మత్తయి దయ్యములు పట్టిన యిద్దరిని గూర్చి తెలుపగా, మార్కు, లూకాలైతే – ఆ యిద్దరిలో ఎక్కువ కఠోరమైన స్థితిగల దయ్యముపై తమ దృష్టి నిలిపారు.[15]

ఆ మనుష్యులలో నుండి అపవిత్రాత్మలను యేసు వెళ్లగొట్టినప్పుడు, ఆ కొండకు దిగువనున్న పందుల గుంపులోనికి[16] ప్రవేశించునట్లు సెలవిమ్మని అవి ఆయనను వేడుకున్నాయి.[17] దయ్యములు ఆ గుంపులోనికి ప్రవేశించినప్పుడు, అవి వేగముగా కొండ దిగువనున్న సముద్రములోనికి వెళ్లి మునిగి చచ్చాయి.

బాప్తిస్మము యొక్క తీరును గూర్చి, సంవత్సరాల క్రిందట, ఒక మతశాఖల ప్రసంగీకునితో జీన్ ఎస్. స్వీనీ వాదం చేస్తున్నాడు: బాప్తిస్మమును గూర్చి క్రొత్త నిబంధన ముంచడమని బోధిస్తుందా లేక చిలకరించడమని బోధిస్తుందా? అనేది ఆ వివాదాంశం. ముంచడానికి సంబంధించిన ఉదాహరణలు అసలు క్రొత్త నిబంధనలో లేనేలేవనే విపరీతపు వాదాన్ని మతశాఖల ప్రసంగీకుడు చేస్తున్నాడు. తమాషాగా మాట్లాడ ప్రయత్నించడంలో – "అవును, నిజమే – క్రొత్త నిబంధనలో ముంచడమనే సంఘటన ఒకటి ఉంది" – అంటూ, సముద్రములో రెండు వేలపందులు మునిగిపోయిన కథను అతడు సూచించాడు. స్వీనీ వేదికమీదికి వచ్చినప్పుడు, యిలా బదులిచ్చాడు – "అవును, ఆ లావాదేవీలో అపవాది నష్టపోయాడు గనుక, అప్పటినుండి వాడు తన విధానాన్ని మార్చుకొనడానికి ప్రయత్నిస్తున్నాడు!"[18]

జరిగిన విషయాన్ని ఆ ప్రాంతపు జనులు తెలిసికొన్నప్పుడు, ఆ చోటును విడిచిపొమ్మని వారు క్రీస్తుకు విన్నవించుకున్నారు. (ఇంకా ఎక్కువైన జంతువులను నష్టపోతారని వారు భయపడ్డారు కాబోలు). ప్రభువు వారి మనవితో సమ్మతించగా, బాగుపడినవారిలో ఒకడు ఆయనతో వెళ్లగోరాడు (మార్కు 5:18). అయితే ప్రభువు వానికి యిలా ప్రత్యుత్తరమిచ్చారు: "– నీవు నీ యింటివారి యొద్దకు వెళ్లి, ప్రభువు నీయందు కనికరపడి, నీకు చేసిన కార్యములన్నిటిని వారికి తెలియజెప్పుమనెను" (మార్కు 5:19).

ఇతరులకు చెప్పవద్దని మిగిలిన వారికి చెప్పిన క్రీస్తు (మార్కు 1:43, 44), ఇతనిని మాత్రం తన యింటికి వెళ్లి యితరులతో తాను పొందిన మేలు చెప్పమనుటలో విశేషమేమో. ఏదియేమైనా, ఈ స్వస్థత శాస్త్రులు పరిసయ్యుల పరిధిదాటి సంభవించి

నందున ఆయన అలా అనియుండవచ్చు. తన్ను ప్రచుర పరచడమనేది యిక్కడ ఆయన శత్రువుల మధ్య ఎక్కువ శత్రుత్వమును రేపకపోవచ్చు. మరొక కారణం ఏమైయుండ వచ్చునంటే, ఆయన అక్కడ బోధించకముందే ఆ స్థలాన్ని విడిచిపోవలసి వస్తుంది. గనుక, ఆ స్థలంలో ఆయన ఒక సాక్షిని విడిచిపోతలంచి యుండవచ్చు.

ఏమి చేయ ప్రభువు ఆజ్ఞాపించారో, అక్కడ అతడు ఆ పనిని జరిగించాడు: "వాడు వెళ్లి, యేసు తనకు చేసినవన్నియు దెకపొలిలో[19] ప్రకటింపనారంభింపగా అందరు ఆశ్చర్యపడిరి" (మార్కు 5:20). తత్ ఫలితంగా, ఆ ప్రాంతానికి ప్రభువు మరల వచ్చినప్పుడు, ఆయనకు మంచి ఆహ్వానం లభించింది (మార్కు 7:31-37).

ఇది ఆశ్చర్యకరంగా హృదయాలను కరిగించే కథయైయుంది. తిరిగి దీన్ని మన మనస్సుల్లో జ్ఞాపకం చేసికొన్నప్పుడు, "ప్రేమింపబడని, ప్రేమకు నోచుకోని వారి దేహాలను మనస్సులను సమీపించి వారిని బాగుచేసే ఈయన ఎవరో?" అని మనం అడుగుతాం. దానికి బదులు – "కనికరముగల మహనీయుడ"నేదే.

యేసు ప్రతివానిని ప్రేమిస్తారని ఈ సంఘటననుండి తెలియబడుతుంది. నీవు ఎవరివో ఏమైయున్నావో అనేదాన్ని బట్టి ఆయన నిన్ను ఎన్నడు ప్రేమించడని నీవు తలంచుతున్నావా? క్రీస్తు మీదికి లేచి వచ్చిన ఆ మురికి, రోతగల ఆ మృగాల వంటివారిని జ్ఞాపకముంచుకో. ప్రభువు వారిని ప్రేమించాడు ఆయన నిన్నునూ ప్రేమిస్తాడు! (ప్రకటన 1:5 చూడు).

## "పాపులతో భోజనముచేయు ఈయన ఎవరో?"

## (మత్తయి 9:1, 10-17; మార్కు 2:15-22; లూకా 5:29-39)

తమ ప్రాంతాన్ని విడిచిపొమ్మని గెరాసీను[20] ప్రజలు ఆయనను కోరినప్పుడు, "ఆయన దోనె యెక్కి సముద్రముదాటి తన పట్టణములో ప్రవేశింపగా" (మత్తయి 9:1) అంటె, ఆయన కపెర్నహోముకు తిరిగివచ్చారని భావం. అక్కడ బహుమంది జనులు ఆయనను కలిసికొన్నారు (మార్కు 5:21; లూకా 8:40 చూడు). తరువాత ఏమి జరిగిందని ఖచ్చితంగా చెప్పడం కష్టం. ఆయన తిరిగివచ్చిన తరువాత కొద్ది కాలంలోనే ఆయన యాయీరు కుమార్తెను లేపారు (మత్తయి 9:18-26; మార్కు 5:22-43; లూకా 8:41-46). ఈ సంఘటనను గూర్చి తరువాత పాఠంలో చదువుదాం. ఈ సందర్భంలో మత్తయి తెలియజేసిన సంభవాన్ని పరిశీలించుదాం.[21] శిష్యుడుగా నుండ అతడు పిలువబడిన తరువాత, ప్రభువు గౌరవార్థం ఒక విందును చేసినట్టు మత్తయి తెలిపాడు. సినాప్టిక్ రచయితలందరు ఈ సంఘటనను సూచించారనుకో. అయితే, దానికి ప్రతిఫలంగా కూడిన జనులు అతిథులలో అగ్రగణ్యుని విమర్శించారు.

### విమర్శ నెం. 1: పాపులతో భోజనం చేయుట

"ఆ లేవి, [మత్తయి] తన యింట ఆయనకు గొప్ప విందు చేసెను. సుంకరులును ఇతరులు అనేకులును వారితోకూడ భోజనమునకు కూర్చుండిరి." (లూకా 5:29). మత్తయి భోజన విందు చేసినప్పుడు, తన గత స్నేహితులను సహ ఉద్యోగులును పిలవడం

సహజం. "అతని యింట ఆయన భోజనమునకు కూర్చుండగా, సుంకరులు పాపులును అనేకులు యేసుతోను ఆయన శిష్యులతోను కూర్చుండియుండిరి. ఇట్టివారనేకులుండిరి; వారాయనను వెంబడించువారైయుండిరి" (మార్కు 2:15).[22]

ఎడతెగక ఆయనను అడ్డుకొంటున్న పరిసయ్యులు, సణుగనారంభించారు (లూకా 5:30ఎ). "పరిసయ్యులు అది చూచి – మీ బోధకుడు సుంకరులతోను పాపులతోను కలిసి యెందుకు భోజనము చేయుచున్నాడని ఆయన శిష్యులనడిగిరి" (మత్తయి 9:11). అందుకు ప్రభువిచ్చిన బదులు మరువలేనిదైయుంది: "యేసు – రోగులకేగాని ఆరోగ్యముగలవారికి వైద్యుడక్కరలేదు. మారుమనస్సు పొందుటకై నేను పాపులను పిలువవచ్చితిని[23] గాని నీతిమంతులను పిలువరాలేదని వారితో చెప్పెను" (లూకా 5:31, 32).[24]

## విమర్శ నెం. 2: ఉపవాసం చేయుటలేదు

దానికి చలించని పరిసయ్యులు రెండవ విమర్శను ఆయనపైకి విసిరారు – ప్రభువును ఆయన శిష్యులును విందునరిగించడం చూచి, వారు దీనికి దిగియుండవచ్చు: "వారు వచ్చి – యోహాను శిష్యులును పరిసయ్యుల శిష్యులును ఉపవాసము చేయుదురుగాని నీ శిష్యులు ఉపవాసముచేయరు; దీనికి హేతువేమని" ఆయననడిగారు (మార్కు 2:18). యోహాను శిష్యులలో కొందరక్కడ ఉన్నారు. "ఎందుకు?" అని వారి స్వరాలు సహితం వినిపించినట్టున్నాయి (మత్తయి 9:14).[25]

ఇంతకు వారి ప్రశ్నలోని సారమేమంటే "ఎంతోకాలం నుండి వస్తున్న పితరుల ఆచారాన్ని నీవెందుకు కొనసాగించడం లేదు?"[26] మెస్సీయ రాకతో నూతన యుగం అవతరించింది, అది గతకాలపు ఆచారానికి అనుగుణమైనది కాదు–అనేది ప్రభువు బదులైయుంది. మొదటి విషయమేమంటే ఉపవాసమనే పరంపర శిష్యులకు తగినదికాదు. మెస్సీయ రాకను పెండ్లివిందుతో ఆయన పోల్చారు (మత్తయి 9:15; మార్కు 2:19, 20; లూకా 5:34, 35). అలాటి ఉత్సవాలు ఆనందించే సమయాలైయుంటాయి, కాని విలపించే సమయాలు కావు.[27] (యూదునికి ఉపవాసమంటే, పశ్చాత్తాపము, తనను తాను బాధపరచు కొనడమునైయుంటుంది).

జవాబులో రెండవ భాగము: మెస్సీయ పరిపాలనకు లేక ఏలుబడికి మానవ పరంపరలు అపాయకరంగా ఉంటాయి. తన ఉపదేశంతో పరిసయ్యుల ఆచారాలను జతచేయడం పాతబట్టకు క్రొత్త మాసిక వేసినట్టౌతుంది (లూకా 5:36). క్రొత్త బట్ట ముడుచుకొని పోయినప్పుడు అది పాత దానిని చింపుతుంది. మరియు పాత పారంపర్యాలను క్రొత్త ఉపదేశంతో చేర్చడం పాత తిత్తులలో క్రొత్త ద్రాక్షారసం పోసినట్టౌతుంది.[28] పాత తిత్తులు ఉబ్బవలసినంత మట్టుకు ఉబ్బి ఆగిపోతాయి. క్రొత్త ద్రాక్షారసం అందులో పోయగానే యిది తిత్తిలో ఉబుకుతుంది. ఉబ్బగలశక్తి పాత తిత్తిలో లేనందున అది తిత్తిని పిగుల్చుతుంది (లూకా 5:37).[29]

తన నూతన మార్గాన్ని పరిసయ్యులు అంగీకరింపరని ప్రభువుకు తెలుసు. "పాతదే సరిపోతుంది" అని చెప్పుతూ, మార్పుపొందడానికి కనీసం ఆలోచింపనివారిని గూర్చి ఆయన ఈ సంగతులు తెలిపారు (లూకా 5:39).[30]

ఈ పాఠాన్ని మనం దాటిపోకముందు, ప్రభువును విమర్శించే సంఘటనకు నేను మరలి వస్తాను: అంటే, పాపులతోను సుంకరులతోను ఆయన కూడి భోజనం చేస్తున్న సంఘటనయే: "పాపులతో భుజించు ఈయన ఎవరో?" "ఉద్దేశముతో కూడిన మనిషి" అనేది దాని జవాబు. "మారుమనస్సు పొందుటకై నేను పాపులను పిలువ వచ్చితినిగాని నీతి మంతులను పిలువరాలేదని" ప్రభువైన యేసు అన్నారు (లూకా 5:32). "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు వచ్చెను" అని ఆయన మరియొక చోట అన్నారు (లూకా 14:10).

నీవు పాపివా? నిన్ను ఆయన లక్ష్యపెట్టునని సందేహిస్తున్నావా? సమాజంలో తృణీకరింపబడిన వారుగా యూదా మత నాయకులు భావించే మత్తయి చేసిన విందులో ఆయన భుజించుతూ, మాట్లాడుతూ ఉల్లాసంగా ఉండినట్టు ఆయనను చూడు. ఆయన పాపులను ప్రేమిస్తాడు! ఆయన నిన్ను ప్రేమిస్తారు!

## ముగింపు

తన చుట్టునున్న వారిని ప్రభువైన యేసు మూడు విధాలుగా ఆశ్చర్యపరచినట్టు మనం చూచాం:

- తుఫానును అణచిన ఈయన ఎట్టివాడో? శక్తిగల మనిషి.
- దేహములను ఆత్మలను బాగుచేయు ఈయన ఎవరు? కనికరం గల మనిషి.
- పాపులతో భోజనము చేయు ఈయన ఎవరో? ఉద్దేశంతో కూడిన మనిషి.

ఆ ఉద్దేశం పాపులను మారుమనస్సు పొందుటకై పిలువవచ్చినదే. నీవు యింకను నీ పాపములలోనే ఉన్నట్టయితే, పశ్చాత్తాపంతోను వినయంతోను నీవు ఆయన వద్దకు వచ్చేలా ఈ పాఠం నిన్ను కదిలించేలా ప్రార్థిస్తున్నాను. ఈ భావనతో "ఈయన ఎవరో" అనే ప్రశ్నకు నీ హృదయమందే జవాబు చెప్పుకో: "ఆయన నన్ను ప్రేమించి నా కొరకు తనను తాను అప్పగించుకున్నవాడు" అనే భావన నీ హృదయాన్ని కదిలింపనిమ్ము!

---


సూచనలు

[1]ప్రభువైన యేసు కనీసం రెండు తుఫానులను అణచారు. ఇది మొదటిది. [2]వర్ణనలోని ఈ సమయంలో, మత్తయి కాబోయే శిష్యులను గూర్చి చెప్పాడు (మత్తయి 8:19–22). లూకా ఈలాటి సంఘటననే దాఖలు చేశాడు లేక ఇలాటి మరొకటి – లూకా 9:57–62లో సూచించాడు. ఈ సంఘటనను చదవడానికి లూకా 9వరకు మనం వేచియుందాం. [3]"సాయంకాలము" అనే పదం సరళమైనది. సాయంకాలం పెందలకడ అయ్యుండ వచ్చు లేక చాలా తరువాత యై యుండవచ్చు. వారు అద్దరికి చేరుకునే సమయానికి కొంత దూరంనుండి ఒక దయ్యం వారిని చూడగలిగింది (మార్కు

5:6). వారు అక్కడికి చేరే సమయానికి యింకా ప్రొద్దుకుంకియుండక పోవచ్చు లేదా సాయంకాలం అలస్యంగా బయలుదేరి యుండవచ్చు. తుఫాను వచ్చినందున అక్కడికి చేరుకొనడానికి మరునాటి ఉదయమై యుండవచ్చు. మొదటిదే జరిగియుండవచ్చు. [4]నరవతారం మర్మాన్ని మనం ముందుగానే చర్చించుకున్నాం. ("కీస్తు జీవితం భాగం1లో" "క్రీస్తు వస్తున్నాడు" అనే పాఠాన్ని చూడు). [5]J. W. Shepard, *The Christ of the Gospels* (Nashville: Parthenon Press, 1939), 232; quoted in H. I. Hester, *The Heart of the New Testament* (Liberty, Mo.: Quality Press, 1963), 148 [6]దేశ పటంలో గలిలయ చుట్టు ప్రాంతాలను చూడు. [7]J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel or A Harmony of the Four Gospels* (Cincinnati: Standard Publishing Co., 1914), 343. [8]వారెంత కంగారు పడ్డారో ప్రభువు కూడా అంత కంగారుపడతారని వారనుకొని ఉండవచ్చు. మనం కంగారు పడేటప్పుడు యితరులు మనకు కంపెనీ యివ్వాలని కోరుకుంటాం. [9]తుఫాను సద్దణగిన పిమ్మట ప్రభువు వారిని గద్దించినట్టు మార్కు, లూకాలు దాఖలు చేశారు (మార్కు 4:40; లూకా 8:25). [10]పలు కారణాలను బట్టి, మిగిలినవాటి కంటెను కొన్ని అద్భుతములే ప్రజల మీద ఎక్కువ ప్రభావాన్ని కనుపరచాయి.

[11]దీనికి సంబంధించిన పాట ఉంటే ఉపయోగించు. [12]ఈ పేర్లు ఆంగ్లంలో కొద్ది మార్పులతో KJVలో ఉంది. ఈ వ్యత్యాసం అంత ప్రాముఖ్యం కాదు. [13]"Kherasa" (గెరసా) సిథిలాలు కనబడేవరకు ఇది అసంబద్ధమని బైబిలు విమర్శకులు తలంచారు. [14]ఈ పాఠం వెంటవచ్చే ప్రసంగంలో ఆ దయ్యముల వివరాలను చూడు. [15]సువార్త రచనలలో యివి సహజంగా కన్పించేవే. [16]అలా వారు విన్నవించు కొనడంలో వారి ఉహ దీనివెంట వచ్చే ప్రసంగంలో చూడు. [17]గెరసా శిథిలాలకు దక్షణాన ఒక మైలు దూరంలో ఒక పర్వతం సముద్ర తీరం వరకు వ్యాపించియుంది. [18]J. W. Roberts Life of Christ, ఉపదేశం నుండి సేకరించబడింది. 68 (Earl I. West, *The Search for the Ancient Order*, vol. 4, *A History of The Restoration Movement 1919-1950* (Germantown, Tenn.: Religious Book Service, 1987), 214. [19]"దెకపొలి" "పది పట్టణముల" ప్రాంతం (దేశ పటంలో చూడు). [20]మత్తయిలో "గెదరేనీయుల" అని ఉంది కాని నేను గెరసీనీయుల అని ఉపయోగించాను గనుక దానినే యిక్కడ ఉపయోగిస్తున్నా. ముందుగా గమనించినట్టే ఈ ప్రాంతానికి రెండు పేర్లున్నాయి.

[21]ప్రభువు సముద్రపు పశ్చిమ తీరం నుండి తిరిగివచ్చిన వెంటనే యాయీరు కుమార్తె సంఘటన ఉంది. అయితే మత్తయి 9:18ని ఆధారం చేసికొని యాయీరు కుమార్తెను లేపడానికి ముందు మత్తయి చేసిన విందు ఉన్నట్టు ఇతరులు తలంచుతారు. [22]వారి ఆత్మలకు వైద్యులుగా వారిని బాగుచేయగోరి చెడ్డవారితో కలపడం తప్ప–వారి సహవాసాన్ని మరో విధంగా సమర్థించడానికి కాదని ప్రభువు మాటలు కార్యములు సూచిస్తున్నట్టు J. W. McGarvey నొక్కి పలుకుతున్నాడు (McGarvey and Pendleton, 350). 1 కొరింథీ. 15:33 చూడు. [23]"నీతిమంతులు" అని ప్రభువు యిక్కడ వాడింది మారుమనస్సు తమకు అక్కరలేదనుకొంటున్న శాస్త్రులు, పరిసయ్యులను సూచించడానికే. [24]మత్తయి వర్ణనలోని ప్రభువు యొక్క జవాబులో హోషేయ 6:6 కోట్ చేయబడింది. మారుమనస్సు పొందునట్లు పాపులను ప్రోత్సహించుట కనికరమును చూపుటయేనని ఆయన మత్తయి 9లో సూచించారు. [25]ఈ విషయంలో యోహాను శిష్యులు పరిసయ్యులతో జతకూడడం దుఃఖకరమైన సంగతి. [26]పరిసయ్యుల ఉపవాసపు ఆచారం మోషే ధర్మశాస్త్రం ఆజ్ఞాపించినది కాదు. అది మనుష్యుల పారంపర్యంనుండి ఏర్పడిందే. "నేను మీతో చెప్పునదేమనగా" అనే పాఠమును "క్రీస్తు జీవితం, భాగం2లో" చూడు. ఉపవాసము భక్తికి అవసరమైనది కాదు. ఉపవాసం యిష్టపడిచేసేదే. [27]ప్రభువు ఉదహరించినదాన్ని ఉపమానమనవచ్చు. ఆ ఉపమానంలో ఆయన పెండ్లికుమారుడు, తన శిష్యులు ఆయన యింటివారు. పెండ్లి కుమారుడు తీసివేయబడునప్పుడు అనేది ఆయన మరణాన్ని సూచిస్తుంది. అప్పుడు వారు ఉపవాస మంటారనేది – వారు దుఃఖిస్తారనే దాన్ని సూచిస్తుంది. [28]ద్రవపదార్థాలను పోయడానికి ఆ దినాల్లో జంతు చర్మపు సంచులను వినియోగించే వారు. కాలం గడిచేకొద్ది ఈ చర్మాలు ఎండి, పెళుసుగా ఉంటాయి. [29]ఈ ఉదాహరణలను లూకా 5:36 ఉపమానాలంటుంది. ప్రభువు బోధింపనుద్దేశించిన దాన్ని మించి యింకేమియు బోధించడానికి వాటిని వినియోగింపకు. [30]పాత పారంపర్యాలను వదలి క్రొత్త మానవ పద్ధతులను అనుసరించుడని ప్రభువు బోధించడం లేదు. క్రీస్తు మార్గాలను అవలంభించునట్టు పరిసయ్యులు తమ పారంపర్యాలను వదలుకొనకయున్నారని ఆయన సూచించారు.


యేసు పరిచర్య
కాలములోని
పాలస్తీనా
సిరియా
బాషాను
జిల్లా
ఫెనీకయ
గలిలయ
బెత్సయిదా?
బెత్సయిదా-జూలియస్
కపెర్నహూము
గెర్గెసా
గలిలయ
సముద్రము
నజరేతు
దెకపొలి
యొర్దాను నది
సమరయ
మహా సముద్రము
పెరయ
యెరూషలేము
యూదయ
మృత
సముద్రము
MILES 0 10 20
KMS 0 10 20 30